


# తండ్రీ తనయులు

## వల్లభ్

**సుబ్బరామశాస్త్రి గారి** షష్టిపూర్తి మహో త్సవం!

ఎంతో ఆడంబరంగా సభా సన్నాహాలు జరిగా యి. శాస్త్రిగారి శిష్యులే పూనుకొని, తమ నెన్నడూ గురుదక్షిణ అడిగి ఎరుగని ప్రియతమ గురువుల యొక్క ఋణాన్ని ఈ విధంగానైనా కొంత తీర్చు కుంటున్నారు.

శాస్త్రిగారి రచనల కెంత ప్రశస్తత ఉందో, వారి చరిత్ర కంత విశిష్టత ఉంది. స్వాతంత్ర్యోద్య మంలో మూ డేళ్ళపాటు కారాగార వాసం అనుభ వించినా, ఆ విషయాన్ని వారు ఎన్నడూ గర్వంగా చెప్పుకోరు. 'పద్యరత్న' బిరుదుతో చందోబద్ధమైన పద్యాల నందించడంలో దిట్ట అనిపించుకున్న శాస్త్రిగారిలో గర్వపు ఛాయలు ఎన్నడూ కానరా వు.

సాంస్కృతిక వ్యవహారాల శాఖామాత్యులు సభకు అధ్యక్షత వహించారు. నూతన వస్త్ర ప్రదా నానికి ఎంతో సంతోషంతో ఒప్పుకున్నాడు ఒక ప్పటి శాస్త్రిగారి ఏకలవ్య శిష్యుడు, ఇప్పటి డి.ఐ.జి. శ్రీనివాసరావ్. ఆరోజు సభ నలంకరించిన వారిలో ఎంతోమంది ప్రముఖు లున్నారు.


అయితే, శాస్త్రిగారి ముఖంలో ఆనంద చిహ్నా లేవీ కానరావడం లేదు. ఎటువంటి కవి సమ్మేళ నంలోనైనా, సాంస్కృతిక సభలలోనైనా నవ్వుతూ, నవ్విస్తూ ఉండే ఆయన నిర్వికారంగా కూర్చోవడం చాలామందికి ఆశ్చర్యాన్ని కలుగజేసింది.

కానీ, శాస్త్రిగారి ఆలోచనలన్నీ కృష్ణపైనే తిరు గుతున్నాయి. శాస్త్రిగారికి ముప్పయ్ ఎనిమిదేళ్ళ వయస్సులో పుట్టిన ఆఖరి సంతానం కృష్ణ. అంతకు ముందు ఇద్దరు కొడుకులూ, కూతుళ్ళూ ఉన్నా, శాస్త్రిగారికి కృష్ణపైనే అమితమైన అనురా గం, ప్రేమ. దానికి తగ్గట్లే కృష్ణ కూడా తండ్రి వెంట వెంటే మొన్నమొన్నటివరకూ తిరిగేవాడు.

ఎక్కడ చేశాను లోపం? వాణ్ణి ఎమ్.ఎ. కోర్సుకు ఉస్మానియా పంపించడమే నేను చేసిన తప్పా? గూటిలో చిలకలాగా గ్రాడ్యుయేషన్ అయ్యేవరకూ పెంచి, ఒక్కసారిగా స్వేచ్ఛ నివ్వడం వల్ల ఇలా జరిగిందా? సభలో కార్యక్రమమంతా యథావిధిగా జరుగుతున్నా, శాస్త్రిగారికి జైలులో ఉన్న కృష్ణ ఆలోచనలే ఎంతకూ తెగడం లేదు. 'ఈ ఆత్యా యిక పరిస్థితి ఇప్పుడే రావాలా?' అనేకమార్లు అనుకున్నదే మళ్ళీ అనుకున్నారు. రెండేళ్ళ క్రి ందటి కృష్ణ ఇప్పుడున్నట్లయితే ఎంత ఆనందప డేవాడు!

రెండేళ్ళుగా కృష్ణ ఇంటికి సక్రమంగా రాకపో యినా, చదువు ధ్యాస అనుకున్నాడు గానీ—జీవి తాలను చదువుతున్నాడన్న చేదు నిజాన్ని ఆరు నెలల క్రితమే తెలుసుకున్నాడు. అతి తక్కువ కాలంలో విప్లవాత్మకమైన 'కవితా సంపుటి'ని ప్రచు రించడమే కాక, ప్రజల సమస్యలకు నాయకత్వం వహించి ఎందరినో ప్రభావితం చేసిన కృష్ణను తాను ఏనాడూ హర్షించలేడు—అది తన స్వభా వానికే వ్యతిరేకం.

ఆత్యాయిక స్థితి ప్రకటించిన వెంటనే కృష్ణను జైల్లో పెట్టారని వాడి మిత్రులు రహస్యంగా వర్తమా నం పంపడం, తాను వెంటనే కృష్ణను కలుసుకోవ డానికి ప్రయత్నించడం, దానికి అనుమతి లభించకపోవడం—అన్నీ శాస్త్రిగారి కళ్ళలో తిరుగాడాయి. అన్నింటి కన్నా బాధాకరమైన విషయం రెండో కొడుకు వాసుదేవ్ నుండి వచ్చిన ఉత్తరం. కృష్ణ సోదరుడనే కారణంతో రాత్రనక, పగలనక పోలీసులు జరుపుతున్న దాడివల్ల తానెం




ంత మానసిక వ్యథకు గురౌతున్నదీ భ్రాన్తూ, వాడికి అన్నగా ఉండటమే తన గ్రహచారమూ, అపచారమూ అన్న మాటలు ములుకుల్లా గుండెలో పొడుస్తున్నాయి.

కొన్ని గంటల్లో మృత్యువు కబళించబోతుండగా నెలల బిడ్డయిన కృష్ణను భార్య వేదనగా, తన గుండెలవిసిపోయేట్లుగా చూసిన చూపు తానే వాడికి తల్లీ, తండ్రీ అయి పెంచిన తీరు గుర్తుకొచ్చాయి. "ఈ ఇంటిలో పుట్టడం నా అదృష్టం, నాన్నగారూ" అనే కృష్ణ మాటలు గుర్తుకు వచ్చి కళ్ళు చెమర్చాయి శాస్త్రిగారికి.

షష్ఠిపూర్తి మహోత్సవం పూర్తయింది. మనసుతో సంబంధం లేకుండా తనువును నడిపించారు శాస్త్రిగారు. తన ఏకలవ్య శిష్యుడూ, అభిమానీ అయిన డి.ఐ.జి. శ్రీనివాసరావును చూడగానే శాస్త్రిగారి మనసులో ఆలోచన పెరిగి పెరిగి మహా వృక్షమైంది. సభనుండి దిగబోతుండగా శ్రీనివాసరావును చెయ్యి పట్టి నిలిపారు.

"నాకో సాయం—నువ్వు చెయ్యగల సాయం—చేస్తావా, శ్రీనూ?"

తానెన్నడూ ఊహించని గురువుగారి కళ్ళలోని ఆర్తిని, గద్గదమైన ఆయన కంఠాన్ని గుర్తించి శ్రీనివాసరావ్ కంపించిపోయాడు. బహుశా శాస్త్రిగారు నోరు తెరిచి అడిగిన మొదటి సాయం ఇదేనేమో!

** ** **

సెల్ నుండి బయటకు వస్తున్న కృష్ణను చూసి బలవంతంగా ఏడుపును ఆపుకున్నారు శాస్త్రిగారు.

"ఎంత చిక్కిపోయావురా!" గుండె లోతుల్లోంచి వచ్చిందా మాట.

చిన్నగా నవ్వాడు కృష్ణ.

"నన్ను చూడాలని నీకు అనిపించలేదా, కృష్ణా?"

కొద్దిగా చలించాడు కృష్ణ. "అన్నయ్యలూ, వాళ్ళూ ఎలా ఉన్నారండీ?" మాట మారుస్తూ అడిగాడు.

శాస్త్రిగారు జవాబియ్యలేదు.

"ఎన్నాళ్ళురా ఇలా?"

"ఏమో!"

"నేనో మాట చెబుతా వింటావా, నాన్నా!" అనునయంగా అడిగారు శాస్త్రిగారు.

ప్రశ్నార్థకంగా చూశాడు కృష్ణ.

"ఇంకెప్పుడూ ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొననని, రచనలు చేయనని ఒక హామీ పత్రం రాసివ్వు. నిన్ను వదిలేస్తారు."

తీక్ష్ణంగా తండ్రివైపు చూశాడు. "నాన్నగారూ! మీరుకూడా స్వాతంత్ర్యోద్యమంలో జైలు కెళ్ళినవారే కదా! అప్పుడు ఇలా ఎవరైనా చెబితే ఏం చేసేవారు?"

సూటిగా తగిలిందా ప్రశ్న శాస్త్రిగారికి. "అది స్వాతంత్ర్యోద్యమం!" నొక్కి పలుకుతూ అన్నారు.

"ఇదీ స్వాతంత్ర్యానికే, నాన్నగారూ, ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యానికి!"

"అప్పటి నా పరిస్థితి వేరు. నీ కెలా చెప్పాలో..నీవు...నీకు... పెళ్ళి కావల్సిన వయసు..."

"మీ రిలా మాట్లాడటం మొదటిసారిగా చూస్తున్నాను నాన్నగారూ!"

కోపం, దుఃఖం పెనవేసుకు వచ్చాయి శాస్త్రిగారికి.

"నువ్వు గురువని ఆరాధిస్తున్న వ్యక్తే ప్రభుత్వానికి దాసోహమన్నప్పుడు మీ ఉద్యమం ఎవరికోసం?"

"పోరబడుతున్నారు, నాన్నగారూ! ఈ ఉద్యమం ఏ ఒక్క వ్యక్తి సొంతమూ కాదు. ఒకరివల్ల ఎన్నడూ ఇది నిలిచిపోదు."

"ఈ వాదనలు అనవసరం, కృష్ణా! నీతో వాదించడానికి నేను రాలేదు. నాన్న నీకు కావాలనుకుంటే హామీ పత్రం రాసి ఇంటికి రా! లేదంటే చిన్నప్పటినుండీ నిన్ను ఎంతో ముద్దుగా, గారాబంగా పెంచిన ఈ జీవాన్ని పూర్తిగా మర్చిపో!" వెళ్ళిపోయారు శాస్త్రిగారు.

బయట కారులో సాదా దుస్తుల్లో ఉన్న శ్రీనివాసరావ్ మాస్టారి ముఖం చూసి జరిగింది గ్రహించాడు.

** ** **

పార్కునుండి ఇంటి కొచ్చిన శాస్త్రిగార్కి బట్టలు సర్దుకుంటున్న కృష్ణను చూడగానే ఎంతో ఆశ్చర్యం: అంతకు మించి ఆనందం కలిగాయి. కళ్ళు ఆనందబాష్పాలతో తొణికిసలాడాయి.

"కృష్ణా!" కరువుతీరా పిలిచారు శాస్త్రిగారు.

తండ్రిని చూసి కృష్ణ గబగబా ముందుకు వచ్చి కాళ్ళకు నమస్కరించాడు.

"చిరంజీవ...సుఖీభవ!" దీవించారు శాస్త్రిగారు.

"ఎప్పు డొచ్చావురా, నాన్నా!" అనునయంగా అడిగారు.

"ఓ అరగంట అయింది నాన్నగారూ!" తిరిగి బట్టలూ, పుస్తకాలూ సర్దుకుంటూ అన్నాడు.

"అప్పుడే ఎక్కడికి ప్రయాణం. పెద్దన్నయ్య దగ్గరకా?"

"లేదు."

"మ రెక్కడికి.?"

"ఏమో...బహుశా కలకత్తా కావచ్చు."

"కలకత్తాలో నీ కేం పని?" అనుమానంగానే అడిగారు.

"ముందు చెల్లాచెదురుగా ఉన్న మిత్రులందర్నీ కూడదియ్యడం నా ప్రథమ కర్తవ్యం. ఆ తర్వాత రహస్యంగా దేశస్థాయిలో ఒక పత్రిక నడపాలనే ఉద్దేశం ఉంది."

శాస్త్రిగారు ఊహించని పలుకులు పిడుగులు పడినట్లుగా ఫీలయ్యారు. నిశ్చేష్టు లయ్యారు.

"అయితే, నువ్వు హామీ పత్రం వ్రాసియ్యలేదా?"

"నేను ఇస్తానని మీ రెలా అనుకున్నారు?" ఎదురు ప్రశ్న.

శాస్త్రిగారికి తన శిష్యుడు శ్రీనివాసరావ్ గుర్తుకొచ్చాడు.

"నిన్నెందుకు వదిలిపెట్టారో తెలుసా?" పళ్ళు బిగువన శాస్త్రిగారు.

"నన్ను బంధించే హక్కే లేనివారికి, విడిచిపెట్టడానికి కారణా లుంటాయని నే ననుకోను." పెట్టె మూస్తూ అన్నాడు కృష్ణ.

"అయితే, విను. నిన్ను విడిపించడానికి నేనే పెద్ద పెద్దవారి దగ్గర సిగ్గు విడిచి బ్రతిమాలి, ప్రాకులాడి ఈ కార్యం సాధించాను. నువ్వు మళ్ళీ ఆ వక్రమార్గాన్నే అనుసరిస్తే ఏం జరుగుతుందో తెలుసా? ఇన్నేళ్ళూ నేను సంపాదించుకున్న ఖ్యాతి, ప్రతిష్ఠ అంతా మండి మసి అవుతుంది. మీ మాటతో ఒక నేరస్థుణ్ణి విడిచిపెడితే, అతను మీ కొడుకై ఉండికూడా మీ రెందుకు నిరోధించలేదు అని అందరూ నన్నడిగితే నేనేం చెప్పేది?"

శాస్త్రిగారి మాటలకు ఏ మాత్రం చలించలేదు కృష్ణ. "నేను వెళ్తున్నాను." బయలుదేరడానికి సిద్ధమవుతూ అన్నాడు.

"ఇదే నీ నిర్ణయ మన్న మాట?"

"అవును."

ఉన్న ఒక్క ఆశా కూలిపోతుండగా, ఆపదల వలయంలోకి అడుగెడుతున్న ప్రియపుత్రుని నిరోధించలేని తన అశక్తతకు కుమిలిపోయారు శాస్త్రిగారు.

"నేను నిన్నెన్నడూ శాసించలేదు. నీకు కావలసినంత స్వేచ్ఛ నిచ్చాను. కానీ, నువ్వా స్వేచ్ఛను పూర్తిగా దుర్వినియోగం చేశావు. నీ తండ్రిగా నే నిప్పుడు శాసిస్తున్నాను. నువ్వెక్కడికీ వెళ్ళడానికి వీల్లేదు... వెళ్ళడానికి వీల్లేదు." కళ్ళు ద్రవడగా, గొంతు వణుకుతుండగా, ఆపాదమస్తకం కంపించిపోతుండగా శాస్త్రిగారు తీవ్రంగా పలికారు.

తానెన్నడూ అంత కోపంలో చూడని తండ్రిని అలా చూసి నివ్వెరపోయాడు కృష్ణ. అయితే, అది క్షణకాలమే! "దయచేసి నన్నాపకండి, నాన్నగారూ! నన్ను వెళ్ళనివ్వండి. నా మనసులో మీ కున్న పవిత్రమైన స్థానాన్ని పోగొట్టకండి. నిన్నమొన్నటివరకూ మీరు చాణక్య నీతి సూక్తి ఒకటి ఎప్పుడూ చెబుతూ ఉండేవారు... గుర్తుందా, నాన్నగారూ? తండ్రి తనయునికి స్నేహితుడివలే సలహాలు ఇచ్చి ప్రోత్సహించాలి గానీ, ఎన్నడూ శాసించరాదని అనేవారు కదా! ఇంత త్వరగా మర్చిపోయారా? ఎలా మర్చిపోతారు?

"లాలయేత్ పంచవర్షాణి. దశ వర్షాణి తాడయేత్

ప్రాప్తేతు షోడశే వర్షే పుత్రం మిత్రవదాచరేత్"—బాధగా గొణుక్కున్నారు శాస్త్రిగారు.

*